www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 8 డిసెంబర్ 2024

డ్రోన్లతో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో దోమల లార్వాలను నాశనం చేయడానకి మనుష్యులు వెళ్లడానికి వీల్లేని ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల మందును పిచికారీ చేస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య చెప్పారు. నారాయణపురం వద్ద శనివారం డ్రోన్ల సాయంతో పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలించారు. నగరంలో అధికారులు గుర్తించిన దోమల వద్ధి ఎక్కువగా 32ప్రాంతాల్లోని 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1:4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ 20 ఎకరాల్లో ఈ మందులు చల్లే కార్యక్రమం చేస్తామని అన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా చేశామని, మూడవ విడత ఈ మందులు పిచికారీ చేస్తున్నామని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ ఉన్నారు.

'హలో' మా సమస్య ఇదే..!

'డయల్ యువర్ కమిషనర్' లేక..
'ప్రజా పరిష్కారాల వేదిక'కు రాలేక..
తిరుపతి పుర ప్రజల ఇక్కట్లు
వృద్ధులు, వికలాంగుల ఆవేదన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇంటిదైనా, వీధిదైనా, నగరానిదైనా.. ఏ సమస్య ఉన్నా ఒకప్పట్లో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమానికి ఫోన్ చేసి పురప్రజలు చెప్పుకునేవారు.. ఇలా వచ్చిన సమస్యలన్నింటిని రిజిష్టర్‌లో నోట్ చేసి, ఆ వారంలోనే వాటిని పరిష్కరించేలా చూసేవారు.. ఇలా చేయడం ద్వారా పురప్రజలకు ఎంతో వెసులుబాటు ఉండేది.. అయితే గతంలో ప్రతి సోమవారం జరిగే 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని రద్దు చేశారు. ప్రస్తుతం ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నడుస్తోంది. అయితే ఈ కార్యక్రమానికి రావాలంటే ఉద్యోగులైతే ఒక పూట సెలవు పెట్టాలి, కూలీలైతే రోజంతా కూలి పోతుంది. అంతేకాదు మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఆటో ఛార్జీలను భరించుకుని కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి అర్జీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా అర్జీ ఇచ్చినా గతంలో 'డయల్ యువర్ కమిషనర్'కు వచ్చిన స్పందన ప్రస్తుతం లేదన్న వాదన పుర ప్రజల్లో వినిపిస్తుంది. 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుపతి నగరంలో తాగునీరు, పారిశుధ్యం, మురుగుకాల్వల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, చెత్త సమస్యలు కోకొల్లలు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి అంతేస్థాయిలో ఫిర్యాదులు ఉంటాయి. తిరపతి కార్పొరేషన్ పరిధిలో 2010లో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2011, 2012, 2014-2019 వరకూ నిర్వహించారు. ప్రతి సోమవారం ఉదయం 9 గంటల నుంచి పది గంటల వరకూ జరిగేది. 50 డివిజన్ల పరిధిలో దాదాపు 20-50 పైగా ఫిర్యాదులు ఫోన్ ద్వారా అందేవి. అయితే ప్రస్తుతం ఈ కార్యక్రమం లేకపోవడంతో ముఖ్యంగా వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని, అధికారులు వాటిని నమోదు చేసుకుని, ఆయా డివిజన్లకు వెళ్లి సమస్యను పరిశీలించేవారు. వారంలో ఆ సమస్యను వీలైనంత వరకూ పరిష్కరించేవారు. స్వయంగా కమిషనర్ ఫోన్ ద్వారా సమస్యలను నోట్ చేసుకోవడంతో అధికారుల్లోనూ భయం ఉండేది. ప్రస్తుతం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరుగుతుంది. అయితే ఈ కార్యక్రమానికి ఖచ్చితంగా అర్జీదారులు వ్యయప్రయాసలకోర్చి దూరంగా ఉన్న కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి అర్జీ ఇవ్వాల్సిందే. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 75 శాతం సమస్యలు పరిష్కారం అవుతుండగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అంతంతమాత్రంగానే సమస్యలు పరిష్కారం అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. కమిషనర్ మౌర్య 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కమిషనర్‌నూ తప్పుదోవ పట్టించారా?

డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో గత 15 ఏళ్లుగా నిర్విరామంగా జరుగుతోంది. అయితే 2024లో ఎలక్షన్ కోడ్ రావడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. తిరిగి ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించలేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని అమలు చేయాలని అర్జీ ఇచ్చినా, కమిషనర్‌ను సిబ్బంది తప్పుదోవ పట్టించారని తెలుస్తోంది. ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం సిబ్బందికి ఇష్టం లేదన్న చర్చ నడుస్తోంది.

పునరుద్ధరించాలి : నరేంద్ర, డివైఎఫ్ఐ

డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రతి సోమ వారం నిర్వహించేలా చూడాలి. నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా కేవలం ఒక్క ఫోన్ ద్వారానే సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లే వెసులుబాటు ఈ కార్యక్రమం ద్వారా ఉంటుంది. అంతేకాదు సమస్యలను రిజిష్టర్‌లో నమోదు చేయడం, అధికారి ప్రతి వారం సమీక్ష చేయడం నిరంతరాయంగా జరిగేది. తద్వారా సమస్యలు పరిష్కారం అయ్యేవి. ఒకవేళ సమస్య పరిష్కరించలేదని మరోసారి ఫోన్ వస్తే ఖచ్చితంగా సిబ్బందిపై కమిషనర్ సీరియస్ అయ్యేవారని తెలుస్తోంది. ఈ కారణంగా ఖచ్చితంగా బాధితుల సమస్య పరిస్కారమయ్యేది. కమిషనర్ జోక్యం చేసుకుని 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలి.

'టీచర్-పేరెంట్' ఆత్మీయ సమావేశాలు
విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు
తల్లిదండ్రులకు 'టగ్ ఆఫ్ వార్' పోటీలు

నైతిక విలువలు నేర్పించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువుతో పాటు, సాంకేతికతను జోడించాలని, నైతిక విలువలను నేర్పించాలని వక్తలు ఉద్ఘాటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ఈ మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ శనివారం ఉత్సాహపూరితంగా ఈ కార్యక్రమం జరిగింది.

రామచంద్రాపురంలో... టిడిపి అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో కమ్మకండ్రిగలోని చేకూరి నాగమనాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కుప్పంబాదూరులో ఎంఇఒ మార్కండేయనాయుడు, కమ్మపల్లిలో బిసి సంక్షేమ శాఖ అధికారి ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు. పదో తరగతి చదువుతున్న వాణి తన పరిజ్ఞానం ఉపయోగించి కొబ్బరి బోండా లోని కొబ్బరి నీళ్లను సులువుగా బయటకు తీసేందుకు ఆమె చేసిన అన్వేషణ జాతీయస్థాయి ఎగ్జిబిషన్కు ఎంపిక కావడం పట్ల బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం చంద్రశేఖర్ 1116 రూపాయలను ఆ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు.

శ్రీకాళహస్తిలో... ఆటల పోటీలు, ఆత్మీయ సదస్సులు జరిగాయి. సహపంక్తి భోజనాలు చేసి సర్వమత సమానత్వాన్ని చాటారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఆ త్మీయ సమావేశాలను నిర్వహిస్తుననట్లు కూటమి నేతలు తెలిపారు. బోనుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మనోహర్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను అందజేశారు. కాసాగార్డెన్ బాలికల గురుకులంలో డిఎస్‌పి నరసింహమూర్తి ప్రిన్సిపాల్ ప్రభావతి పాల్గొన్నారు.

రేణిగుంటలో... విద్య ద్వారానే సమాగ్రాభివృద్ధి సాధించవచ్చని డిఎస్‌పి శ్రీనివాసరావు అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పుష్పలతతో కలిసి పాల్గొన్నారు. తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఎంఇఒ ఇందిరాదేవి పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో... జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.

తిరుపతి టౌన్‌లో.. బేరివీధిలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని తల్లిదండ్రులకూ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.ఖాదర్‌బాషా, కార్పొరేటర్ నరసింహాచారి పాల్గొన్నారు.

పెళ్లకూరులో... 'బడివైపు ఒక అడుగు వేద్దాం' అనే నినాదంతో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చదువుతో పాటు సంస్కారాన్ని నేర్పించాలన్నారు.

తడలో.. కాసింగాడు కుప్పంలోని ఎంపియుపి పాఠశాలలో 200 మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు హోలిస్టక్ ప్రోగ్రెస్ కార్డులను అందించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కొళవి రఘురెడ్డి, ఎంపిడిఓ విజయ్ కుమార్, యంఈఓ కె.మల్లికార్జున రావు పాల్గొన్నారు.

గూడూరులో... జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల, చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్లో ఎంఎల్ఎ పాశిం సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశాల వల్ల తమ పిల్లలు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకోవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటి డిఇఒ సనత్‌కుమార్ పాల్గొన్నారు.

వందమంది పిల్లల్ని చేరిస్తే సిసి రోడ్డు : గంజి మాధవయ్య

పుత్తూరు టౌన్‌లో... నైతిక విలువలతో కూడిన బోధన చేయడం ద్వారా విద్యార్థుల నుంచి మంచి ఫలితాలను ఆశించవచ్చని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. పరమేశ్వర మంగళం జ డ్‌పి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలకు వచ్చే రోడ్డును సిసి రోడ్డుగా మార్చాలని ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. వచ్చే ఏడాది పాఠశాలలో వందమంది విద్యార్థులను చేరిస్తే తప్పకుండా సిసి రోడ్డు వేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయశేఖర్, బాలాజీ, నగేష్, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

నారాయణవనంలో.. ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. జడ్‌పి ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, డాక్టర్ దర్శత్‌రాజ్, డిప్యూటీ డిఇఒ ప్రభాకర్‌రాజు, హెడ్‌మాస్టర్ శశికళ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో.. మంగళంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉద్దండి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. జిల్లా స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, మండల విద్యాశాఖ అధికారి ఎస్.శీనయ్య హాజరయ్యారు.

ఎన్ని కష్టాలొచ్చినా బాలికలు డిగ్రీ చదవాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నేటి తరంలోని విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం బైరాగిపట్టెడ లోని మహాత్మాగాంధీ మునిసిపల్ స్కూల్ నందు నిర్వహించిన మెగా తల్లిదండ్రుల సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలసి మాట్లాడుకోవడం వలన విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన వారు అవుతారని అన్నారు. అందుకోసమే ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ పేరంట్స్ మీటింగ్ నిర్వహించాలని అన్నారు. మగ పిల్లలైనా, ఆడ పిల్లలైనా ఎవరికి వారు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. ముఖ్యంగా బాలికలు ఎన్ని కష్టాలు వచ్చినా డిగ్రీ వరకు తమ విద్యను ఆపకుండా చదవాలన్నారు. కొంతమంది బాలికలకు యుక్త వయసు రాకుండానే వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. ఈ బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కర్నూల్ సమీపంలో ఒక చిన్నారికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు యత్నించగా ఐసిడిఎస్ వారు అడ్డుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి చదివించారన్నారు. ఆ విద్యార్థి చదువుల్లో బాగా రాణించి మొదట ర్యాంకు సాధించిందని ఇది ఎంతో గర్వకారణం అన్నారు. ఈ స్కూల్ ను పరిశీలించానని, డ్రెయినేజీ సమస్య ఉందని, మరుగుదొడ్లు కట్టించాలని అడిగారన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, ప్రజాప్రతినిధులు శ్రీధర్ వర్మ, తిరుపతి డివిజన్ విద్యాశాఖాధికారి బాలాజి, మండల విద్యాశాఖ అధికారి భాస్కర్, ప్రధానోపాధ్యాయులు రవి, భానుమతి, సి.డి.పి. ఓ. సుధారాణి పాల్గొన్నారు

గురువులు లేక గురుకులాలు వెలవెల

ప్రజాశక్తి - రేణిగుంట

గురువులు లేక ట్రైబల్ గురుకులాలు వెలవెలబోతున్నాయని విద్యార్థులు వాపోయారు. రేణిగుంట ట్రైబల్ గురుకుల పాఠశాలలో గురువులు సమ్మెలో ఉండడంతో తమకు సిలబస్ పూర్తి కాక పాసవుతామో లేదోననే భయం పట్టుకుందని వాపోయారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ గతనెల 25వ తేదీ నుంచి ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారని, అయితే విద్యార్థులకు సిలబస్ పూర్తి కాలేదని, ఫెయిలైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు సజావుగా తరగతులు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాల, స్కూల్ మేనేజిమెంట్ ఛైర్మన్ రాజేష్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల చదువుతో పాటు ఆటపాటలు, ఇతర నైపుణ్యాలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ.వెంకటరమణ మాట్లాడుతూ చదువు, ఆటలు, పాటలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి, మానవీయ విలువలను పంచాలన్నారు. నాయకులు హరినాథ్, కుప్పస్వామి, ఈశ్వరి, ఇమామ్, జబ్బార్, దీపం పాల్గొన్నారు.

తుడా కోసం తంటా



ఎంఎల్ఎ

జనసేన × టిడిపి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ (తుడా) ఛైర్మన్ గిరి కోసం జనసేన, టిడిపిలో సిగపట్లు మొదలయ్యాయి. మాకా, మీకా అంటూ ఇరు పార్టీల్లోనూ వివాదం రగులుతోంది. దీంతో ఎవరికి ఇవ్వాలో దిక్కుతోచక అధినేత నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కల్యాణ్ తల పట్టుకునే పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో బిజెపి, టిడిపి, జనసేన ఒప్పందం మేరకు పదవుల పందేరం జరగాలి. అయితే బిజెపి నుంచి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి టిటిడి బోర్డు మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసి తన పదవిని దక్కించుకున్నారు. ఇప్పటివరకూ తిరుపతిలో టిడిపి, జనసేన పదవుల పందేరం జరగలేదు. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు జనసేన నుంచి గెలుపొందడంతో తిరుపతిలో కీలకమైన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, తుడ ఛైర్మన్ పదవులు తమకే లభిస్తాయని ఆశించారు. అయితే టిడిపి నుంచి పదవులు ఆశిస్తున్న మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్ల నరసింహయాదవ్, వూకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీనివాసులు పదవుల కోసం పట్టుబడుతున్నారు. వీరితో పాటు చంద్రగిరి నియోజకవర్గం నుంచి డాలర్ దివాకర్‌రెడ్డి సైతం తుడ ఛైర్మన్ కోసం పట్టు బిగిస్తున్నారు. అయితే మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ ఎంఎల్‌సి ఇవ్వాలని పట్టుబడుతున్న నేపథ్యంలో ప్రస్తుతానికి ఎంఎల్‌సి ఎన్నికలు లేవు. ఎంఎల్‌సి లేకపోయినా సరే తుడా ఛైర్మన్ పదవి దక్కితే, తుడ ఛైర్మన్‌తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారు. తుడా ఛైర్మన్ కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల యాదవ్ కార్పొరేషన్‌కు రాష్ట్ర ఛైర్మన్‌గా నరసింహయాదవ్ పేరును ముఖ్యమంత్రి అధికారికంగా ప్రకటించారు. అయితే తనకు ఈ పదవి ఇష్టం లేదని అలకబూని తిరస్కరించారు. 2014లో టిడిపి అధికారంలో ఉన్నపుడు రెండేళ్లపాటు నరసింహయాదవ్ తుడ ఛైర్మన్‌గా ఉన్నారు. మళ్లీ తుడ ఛైర్మన్ ఇవ్వాలని నరసింహయాదవ్ భీష్మించుకుని కూర్చున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఒప్పందంలో భాగంగా ఎవరైతే వారికే మెజార్టీ పదవులు ఇవ్వాలన్న ఒప్పందం ఉంది. ఈ మేరకు తనకు తుడ ఛైర్మన్ పదవి కావాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ముందు తన డిమాండ్‌ను డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఉంచారు. అలాగే జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తానూ అదే పదవికి క్యూలో ఉన్నానని బాహాటంగానే చెబుతున్నారు. జనసేన ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు గెలిచిన తరువాత ఒక్క బిజెపికి మాత్రమే భానుప్రకాష్‌రెడ్డికి అవకాశం వచ్చింది. మిగిలిన జనసేన, టిడిపి నేతలకు రెండో విడతలోనూ నామినేటెడ్ పదవులు దక్కలేదు. అయితే తుడ ఛైర్మన్ కోసం మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, నరసింహయాదవ్, డాలర్ దివాకర్‌రెడ్డి ప్రయత్నిస్తుండగా, జనసేన నుంచి పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఏమైనప్పటికీ పదవుల కోసం టిడిపి, జనసేన మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుంటోంది.

నాడు నిర్వీర్యం... నేడు ఆంక్షలు..!

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి రూరల్)

'కరవమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం' అన్న చందంగా మారింది.. వైసిపి, కూటమి హయాంలో సర్పంచుల పరిస్థితి.. గ్రామాల అభివద్ధికి పంచాయతీలే పట్టుకొమ్మలని, అలాంటి గ్రామ పంచాయతీలను గత వైసిపి ప్రభుత్వం గ్రామ పంచాయతీ నిధులను డ్రా చేసి నవరత్నాల పథకాలకు మళ్ళించి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. అలాగే పంచాయతీ కార్యాలయం స్థానంలో సచివాలయాలు ఏర్పాటు చేసి, గ్రామాలలో వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి గ్రామపంచాయతీ సర్పంచ్, పాలక వర్గానికి విలువ లేకుండా చేసింది. దీంతో గ్రామాలలో అభివద్ధి పనులు, తాగునీటి కొళాయిలు, వీధి దీపాల మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితుల్లో గ్రామ సర్పంచులు నిధుల కోసం హైరానా పడ్డారు. అలాంటి వైసిపి 2024 సాధారణ ఎన్నికల్లో ఘోర ఓటమిపాలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రిగా జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టారు. దీంతో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కొణిదల పవన్ కళ్యాణ్ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం కూడా రావాల్సిన 15 ఫైనాన్స్ నిధులను, గ్రాంట్లను రాష్ట్ర ప్రభుత్వం నుండి పంచాయతీలకు చెల్లించాల్సిన నిధులను తాజాగా పంచాయతీ అకౌంట్‌కు జమ చేశారు. గత మూడు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం లో గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోయినా...... స్థానిక సర్పంచులు గ్రామాలలో ప్రధానమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లను సొంత డబ్బులతో ఖర్చు చేసి పనులను పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది...... గ్రామ పంచాయతీలకు నిధులు వరదల వస్తున్నాయి. సర్పంచులు ఆనందపడ్డారు. కానీ పంచాయతీ నిధులను గతంలో చేసిన పాత పనులకు బిల్లులు పెట్టుకుని డ్రా చేసుకొని అప్పులు తీర్చుకునే యోచనలోకి సిద్ధమయ్యారు. కానీ కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను నూతన అభివద్ధి పనులకు ఉపయోగించేలా చర్యలు చేపడుతున్నది. ఈ కారణంగా ప్రతి పంచాయతీలో రూ.50 వేల రూపాయలకు లోపు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు డ్రా చేసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తూ...... రూ.50 వేల రూపాయలకు మించితే ఎంపీడీవో అనుమతి కచ్చితంగా తీసుకోవాలని ఆంక్షలు పెట్టింది. దీంతో గ్రామపంచాయతీ సర్పంచులు దిక్కు తోచక డీలా పడ్డారు. గతంలో గ్రామ పంచాయతీలలో నిధులు ప్రభుత్వం ఇవ్వనప్పటికీ..... భవిష్యత్తులో నిధులొస్తే తీసుకుందాములే..... అని ధోరణితో అప్పులు చేసి పంచాయతీల్లో పనులు చేయించారు. నిధులు వచ్చిన తర్వాత ఈ ఆంక్షలు ఏంటని సర్పంచులు మదనపడుతున్నారు.

నిధుల డ్రాపై సర్పంచుల్లో నిరాశ

ఏది ఏమైనప్పటికీ ఎలాగైనా గ్రామపంచాయతీలకు వచ్చిన నిధులను డ్రా చేసుకునేందుకు తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలాలకు చెందిన సర్పంచులు స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. రాజకీయాలకు అతీతంగా, గ్రామాల అభివద్ధికి సర్పంచులు సహకరించాలని ఆయన కోరారు. మరోవైపు అదే సర్పంచులు మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కలిసి గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి.... నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే..... కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చి, నిధులు డ్రా చేసుకోవడానికి ఆంక్షలు పెట్టిందని తమ సమస్యలను మొరపెట్టుకునానరు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిధులు డ్రా చేసుకోవడానికి పోరాటం చేద్దామని హామీ ఇచ్చినట్లు కొంతమంది సర్పంచులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ పంచాయతీ సర్పంచులు నిధులు డ్రా చేసుకోవడం కోసం రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు నిధుల కోసం ప్రదక్షణ చేస్తే...... నేడు నిధులు డ్రా చేసుకోవడం కోసం నిరీక్షణ చేయాల్సివస్తోందని నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టిన ఆంక్షలపై ఎలాంటి నిర్ణయం వస్తుందోనని సర్పంచులు ఎదురుచూస్తున్నారు.

పులివర్తి నాని, చెవిరెడ్డి లను కలిసిన సర్పంచులు

వర్శిటీలో 'మత' విద్వేషాలు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

విద్యార్థుల్లో జ్ఞానాన్ని నింపేవి విద్యాసంస్థలు. విశ్వవిద్యాలయాలు విజ్ఞానాన్ని పంచుతూ విలువులను నేర్పి, జీవిత పయానాన్ని ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తీర్చిదిద్దుతాయి. అలాంటి విశ్వవిద్యాలయాల్లో విద్వేషాలు రేపడం దారుణం. మతతత్వ బూర్జువా రాజకీయ పార్టీలు తమ ఆధిపత్యం కోసం విశ్వవిద్యాలయాల్లో మత విద్వేషాలను పెంచి పోషిస్తున్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి ఇందుకు వేదికయ్యింది. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇది మరింత విజృంభించడం శోచనీయం. ఏకంగా విద్యార్థుల మాటున అచార్యులపై మతం సాకుతో దాడులు చేయడం గర్హనీయం.

తిరుపతి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ప్రాంతం. ఆధ్యాత్మిక కేంద్రమే కాదు. విద్యాకేంద్రంగానూ విరాజిల్లుతోంది. తిరుపతి నగరంలో ఏకంగా 8 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా వందలాది డిగ్రీ, ఇంటర్ కళాశాలలు, వేలాది ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ స్కూల్స్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ప్రోటోకాల్ పరంగా తిరుపతి ముఖ్యకేంద్రం కావడంతో ఇక్కడ ఏమి జరిగిన అది సంచలనంగా మారుతుంది. దీన్ని ఆసరాగా తీసుకుని మతతత్వశక్తులు ఈ ప్రాంతంలో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పూనుకోవడం శోచనీయం. దీనికి బూర్జువా రాజకీయ పార్టీలు వత్తాసు పలకడం గమనార్హం. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పేరెన్నికగన్న వర్శిటీ. వర్శిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విభాగం హెచ్‌వోడి (హెడ్‌ఆఫ్‌ది డిపార్టుమెంట్)గా దళితవర్గానికి చెందిన ప్రొఫెసర్ చెంగయ్య విధులు నిర్వహిస్తున్నారు. క్రిస్టియన్ అయిన చెంగయ్య వర్శిటీలో అత్యంత సీనియర్ ప్రొఫెసర్. ఆరు నెలల క్రితం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వర్శిటీలో ఆధిపత్యం కోసం పాకులాడుతున్నారు. ఈ నేపథ్యంలో మతతత్వ శక్తులు ఎలాగైనా బూర్జవ రాజకీయ పార్టీల సహాయంతో పెత్తనం చేయాలని వర్శిటీలో విద్వేషాలు రేపాయి. వర్శిటీలో అన్యమత ప్రచారం చేస్తున్నారన్న సాకుతో ఈ నెల 2వ తేది తన కార్యాలయంలో ఉన్న ప్రొఫెసర్ చెంగయ్యపై భజరంగదళ్, ఏబివిపికి చెందిన కొంత మంది దాడి చేసి, కాలర్‌పట్టుకుని ఈడ్చి, పిడిగుద్దులు గుద్దారు. అతని కారుపై సైతం దాడి చేసి ధ్వంసం చేశారు. ఏకంగా ఓ ప్రొఫెసరు, హెచ్‌వోడిపైనే కార్యాలయంలోనే దాడి చేయడంతో అక్కడి సిబ్బంది అవాక్కయ్యారు. ప్రొఫెసరుపై దాడిని ఖండించకపోగా బిజెపి పార్టీ చెంగయ్యపైన కేసులు పెట్టాలని, అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ప్రొఫెసర్‌పై దాడిని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, దళిత సంఘాలు ఆ మరుసటి రోజు వర్శిటీ పరిపాలన భవనం వద్ద భారీ ఎత్తున నిరసన తెలియజేశాయి. దీనికి కౌంటర్‌గా బిజెపి, విశ్వహిందూపరిషత్, ఏబివిపి వాటి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అన్యమత ప్రచారం చేస్తున్న ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని ర్యాలీ చేపట్టారు. దీనికి ఖండనగా దళిత, క్రిస్టియన్ సంఘాలు, ఆర్‌పిఐ, బిఎస్‌పి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, ప్రొఫెసర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలని డిమాండు చేశారు. దీనికి మరింత ఆజ్యం పోసేందుకు బిజెపి సీనియర్ నాయకులు, టిటిడి బోర్డు సభ్యుల హోదాలో వర్శిటికి వచ్చి ఏకంగా విసిని దీనిపై నిలదీశారు. ఎస్వియులో అన్యమత ప్రచారాన్ని అరికట్టాలని, అందుకు కారుకులైన ప్రొఫెసర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఒత్తిడి సైతం తీసుకొచ్చారు. వర్శిటీలో పెరుగుతున్న విద్వేషాలను అరికట్టాలంటూ రెండు రోజుల క్రితం సిపిఎం, సిపిఐ, ఆర్‌పిఐతో పాటు పలు పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, క్రిస్టియన్ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి తీర్మానించారు. ఈ విద్వేషాలు మరింత పెట్రేగకుండా, ఇప్పటికైన వర్శిటీ ఉన్నతాదికారులు దీనిపై స్పందించి మత విద్వేషాలను అరికట్టి, ప్రొఫెసర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. లౌకివాద నినాదంతో, రాజ్యాంగ స్ఫూర్తితో విశ్వవిద్యాలయాలను కుల, మతాలకు అతీతంగా నిలిపి, మతవిద్వేషాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మీరైనా పరిష్కరించండి..

రెవెన్యూ గ్రామ సభల్లో అర్జీల వెల్లువ

గత ప్రభుత్వ హయాంలో భూ సమస్యలు పరిష్కరించలేదు.. ఇప్పుడు మీరైనా పరిష్కరించండి..' అంటూ రెవెన్యూ అధికారులకు అర్జీలు వెల్లువలా వస్తున్నాయి. రెండవ రోజు శనివారం పలు గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని వేణుంభాకం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం ఆ గ్రామ ప్రజల నుండి భూ సంబంధిత సమస్యలతోపాటు, పలువురు పలు భూ సంస్థలపై అర్జీలు ఇచ్చారు. మరికొందరు ఇళ్ల స్థలాలకు పట్టాలు కావాలని తహశీల్దారు శైలజాకుమారికి అర్జీలు అందించారు. అందిన అర్జీలను పరిశీలించి తమ పరిధిలో వున్న భూ సమస్యలు పరిష్కరిస్తామని తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నరాళ్లాలంపేట నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ఎస్‌కె షబ్బీర్, వీఆర్‌వో భాషయ్య, సర్వేయర్ నాగరాజు, సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, మధుసూదన్‌రెడ్డి, ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు, గ్రామ పెద్దలు మస్తాన్ బాబు, మౌలా, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయండి

రామచంద్రపురం: 'శ్మశానాలు కబ్జాలు పాలై దారిలేక సొంత పొలాలలో మృతదేహాలను పూడ్చుకుంటున్నాం.. మాకు వెంటనే శ్మశానం ఏర్పాటు చేయండి' అంటూ బ్రాహ్మణ కాలువ, బ్రాహ్మణ కాలువ ఏఏ డబ్ల్యూ గ్రామస్తులు, దళితులు తిరుపతి ఆర్‌డివో రామ్మోహన్, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌లను వేడుకున్నారు. మండలంలోని బ్రాహ్మణ కాలువ లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును తిరుపతి ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామంలో శ్మశాన వాటిక దారి కబ్జాకు గురైందని, మృత దేహాలను పూడ్చేందుకు అవస్థలు పడుతున్నామని ఆర్డీవోకు వివరించారు. స్పందించిన వెంటనే ఆర్డీవో శ్మశాన వాటికలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ కాలువ ఏ ఏడబ్ల్యు దళితుల ఇంటి స్థలా లకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వెంకటరమణను ఆర్డీఓ ఆదేశించారు. గ్రామంలో కసిం కాలువ లను కొందరు ఆక్రమించ డంతో వరద నీరు గ్రామంలోకి ప్రవేశించి రహదారి పూర్తిగా మునిగి రాకపోకలు ఇబ్బందికరంగా మారా యని అధికారులక ఉవివరించారు. స్పందిం చిన గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్ ఎం చంద్రశేఖర్, తహశీల్దారు కే వెంకటరమణలు పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి వరద నీటితో నిండిన రహదారిని పరిశీలించారు. కసిం కాలువల ను కబ్జాను తొలగించి రహదారిపైకి నీరు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ సదస్సులకు వచ్చిన 37 ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కుమార్, ఇరిగేషన్ ఏఈ ఎత్తి రాజులు, ఆర్ ఐలక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్ బాబు, వీఆర్వో నరసింహులు సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌డివోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామం నుండి తెర్రిపాడు గ్రామానికి లిక్‌రోడ్డు ఏర్పా టు చేయాలని తహశీల్దారు సుబ్రమణ్యం కు వినతి పత్రం అందించారు. శనివారం పుత్తూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండ ల అధ్యక్షులు సుధాకర్ నాయుడు పాల్గొన్నారు. గ్రామస్తులు పలు భూ సమస్యలను ఏకరువు పెట్టారు. ఉత్తెరి గ్రామం మండల కేంద్రానికి దూరంగా ఉందని, పుత్తేరి గ్రామం నుండి లింక్ రోడ్డును ఏర్పాటు చేస్తే దూరం తగ్గుతుందని గ్రామస్తులు తెలిపారు. మ్యూటేషన్లు, కరెక్షన్స్, సర్వే, లపై 'పలు వినతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో త్రివిక్రమరావు, ఆర్ఐ నల్లయ్య, సర్పంచ్ రామ్మూర్తి, వీఆర్ ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని చింతలపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అత్యధికంగా 29 దరఖాస్తులు ల్యాండ్ అక్విజేషన్‌కు 17, పాస్ బుక్ సబ్ డివిజన్‌కు 1, రికార్డు ఆఫ్ రైట్స్‌కు 4, మీసేవ గ్రీవెన్స్ రెవెన్యూకు సంబంధించి 2, అసైన్‌మెంట్ ల్యాండ్ యాక్ట్ 1977కు నాలుగు, ఇతరాలకు ఐదు అందాయని తహశీల్దారు భార్గవి తెలిపారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): రాష్ట్రంలోని రైతన్నల భూ సమస్యల పరిష్కారానికి 'మీ భూమి-మీ హక్కు' రెవెన్యూ సదస్సులు చక్కటి వేదికలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాలలోని పుదిపట్ల సచివా లయంలో ,ఎం.కొంగరవారిపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడి సుధా యాదవ్, అల్మినేని మధు నాయుడు, ఏ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

క్రైం న్యూస్

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన తిరుపతిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోలా వీధిలో శశిధర్, సుభాషిణి దంపతులు నివసిస్తున్నారు. సుభాషిణికి మతి స్థిమితం సరిగా లేదు. శనివారం భర్త స్నానానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి సుభాషిణి చీరతో ఉరి వేసుకుంది. భర్త ఆమెను స్థానికులతో కలిసి ఆస్పత్రికి తరలించారు. రుయా ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సుభాషిణి తమ్ముడు కమతం కుమార్ అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏర్పేడులో మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం నాగంపల్లి గ్రామ సమీపంలోని ఎస్‌ఓఎస్‌లో చదువుతున్న హరీష్ తండ్రి రామచంద్రయ్య మొగిలి బంగారు పాలెం మండలానికి చెందిన అతను నవంబర్ 17వ తేదీ ఎస్‌ఓఎస్ లో చేరాడు. అయితే అతను డిసెంబర్ 4 తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుండి కనబడలేదని చుట్టుపక్కల వెతికి విచారించినా ఆచూకీ కనిపించకపోవడంతో ఏర్పేడు పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని మోదుగులపాలెం గ్రామస్తుడు వెంకటగిరి హరి కుమ్మరి కండ్రిక ఎస్టీ కాలనీ రోడ్డుపై అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం అమ్ముతుండగా అతని వద్ద నుండి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.

బ్లడ్ గ్రూపులపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మైక్రోబయాలజీ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్‌పై కళాశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినివిద్యార్థులు తమ రక్త గ్రూపు గురించి తెలుసుకోవాలన్నారు. ఆపదలో రక్త దానం చేసే సమయంలో అది ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమం మైక్రోబయాలజీ విభాగం ద్వారా లక్ష్మి, హిమ బిందు రక్త గ్రూపుల విశ్లేషణ వివరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు తమ తమ రక్త గ్రూపులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వై శ్రీనివాసులు, డాక్టర్ పి నారాయణ రాజు, శ్రీధర్ శర్మ, డాక్టర్ పి విజయ మహేష్, మీనాక్షి, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం అనాగరిక చర్య: అంజూరు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో దేవస్థానం నిర్మించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం అనాగరిక చర్య అని ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. తమ పాలక మండలి ఉన్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అయితే అభివృద్ధి కార్యక్రమం జరిగినప్పుడు భవిష్యత్తు తరాలకు తెలిసే విధంగా అక్కడ శిలాఫలకాలు ఏర్పాటు చేశామని, శిలాఫలకాలు వ్యక్తికి సంబంధించింది కాదని, వ్యవస్థకు సంబంధించినవని, అలాంటి శిలాఫలకాలు ప్రభుత్వాలు మారినప్పుడల్లా ధ్వంసం చేస్తే అంతకన్నా అనాగరిక చర్య లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుంభాభిషేకం అనంతరం నంది సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారన్నారు. హరహర తీర్థం, శివయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలనూ ధ్వంసం చేశారని చెప్పారు. ఇవన్నీ దేవస్థానం ఆస్తి అని తెలిపారు. దేవస్థానం ఆస్తులను ధ్వంసం చేస్తుంటే ఆలయాధికారులు నిర్లక్ష్యం చూపడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పిన్సిపాల్ కేసీ రేణుకమ్మ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ, ఇంగ్లీష్ అధ్యాపకుల పోస్టులకు పీజీలో 50 శాతం ఉత్తీర్ణత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బోధనానుభవం, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 11 తేదీ లోపు దరఖాస్తు పూర్తి చేసి వారి విద్యార్హత ధ్రువపత్రాలతో పిన్సిపల్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 9493815491 నెంబరును సంప్రదించాలని కోరారు.

బంగరు భవితకు బాటలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పురోగతికి బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం పట్టుదలతో ఉందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవోలు భారతి, భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షులు గాలి మురళినాయుడు, చెంచయ్యనాయుడు, విజయ్ కుమార్ నాయుడు, ప్రతాప్ రెడ్డి మునిరత్నం పాల్గొన్నారు.

కోర్టు భవనం పనులు నాణ్యతగా చేపట్టాలి

జిల్లా జడ్జి భీమారావు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : కోర్టు భవనం మరమ్మతు పనులు నాణ్యతగా నిర్వ హించాలని జిల్లా జడ్జి భీమా రావు ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పుత్తూరు కోర్టు భవనం మరమ్మతు గురి కావడంతో నిర్వహిస్తున్న పనులను జిల్లా జడ్జి శనివారం పరీక్షించారు. కోర్టులో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు భవన నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని అందులో ఏదైనా తేడా వస్తే చర్యలు తప్పవని ఆర్అండ్‌బి అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె పురుషోత్తం, రాజారెడ్డి, న్యాయవాదులు, ఆర్అండ్‌బి అధికారులు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

పాఠశాల పిల్లలతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని కుప్పం బాదూరులోని రాయల చెరువు పేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తిరుపతి ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు శనివారం తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటింగ్ కమిటీ సభ్యులు రామ్ సింగ్ ఈనెల 14వ తేదీ కుప్పం బాదూరు విద్యుత్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిం చనున్న నేపథ్యంలో శనివారం ముందస్తుగా పుత్తూరు ఇఇ ఆశీర్వాదం, ఇఇ శంకరయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిలు పరిశీలించారు. విద్యుత్ సబ్‌సేషన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు మరమ్మతులు చేయాలని ఎస్ఈ విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కుప్పం బాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సికేపల్లి, పరమాల, మిట్ట కండ్రిగ, కొత్త కండ్రిగ,, బలిజపల్లి, పివిపురం గ్రామాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ గిరి కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి యాదవ్, వరాలు, వెంకట ముని విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

మఠం భూమి కోసం ఘర్షణ

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం , నరసింగాపురంలో మఠం భూమి కోసం ఇరు గ్రూపులు పరస్పరం ఘర్షణకు దిగాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నరసింగాపురం లెక్క దాఖల సర్వే నెంబర్ 321లో ఉన్న మఠం భూమిని దళిత రైతు నక్క నరసయ్య 99 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. నరసయ్య మరణానంతరం ఆయన కుమారుడు, ఆయన మనుమళ్లు, వారసులు సదరు భూమిని ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్నారు. అయితే పక్క పొలంలోని అగ్రవర్ణాల భూస్వాములు సర్వే పేరుతో తమ భూముల్లోకి ప్రవేశిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దళిత రైతులకు ఎలాంటి సమాచారం అందించకుండానే జెసిబి తీసుకొచ్చి రహదారి ఏర్పాటు చేయటానికి ప్రయత్నించారు. ఈ సమాచారం తెలుసుకున్న దళిత రైతు కుటుంబీకులు జెసిబి యంత్రానికి అడ్డుగా పడుకున్నారు ఈ నేపథ్యంలో ఇరు గ్రూపుల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని వివాదాన్ని తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. తమ కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా ఈ భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తోందని ఇలాంటి తరుణంలో భూస్వాములు ఇబ్బంది పాలు చేయటం తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దళిత రైతులు వాపోయారు.

సర్క్యులర్ ప్రకారం ఉద్యోగ అవకాశం కల్పించాలి

సిఐటియు సీనియర్ నాయకులు ఎం శేషయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆర్‌టిసిలో వివిధ కారణాలతో సస్పెన్షన్ వేటు విధించిన కార్మికులను 1/2019 సర్క్యులర్ ప్రకారం తిరిగి పనుల్లోకి తీసుకోవాలని సిఐటియు సీనియర్ నాయకులు ఎం శేషయ్య పేర్కొన్నారు. అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని నిరసిస్తూ ఏపీఎస్ ఆర్‌టిసి గూడూరు డిపో ఎదుట అక్రమ సస్పెన్స్ లను రద్దు చేయాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ (సిఐటియు) డిపో ప్రచార కార్యదర్శి రఘురామయ్య ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు ఎం శేషయ్య మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ ప్రకారం ఎస్‌డబ్ల్యూఎఫ్ సభ్యులను సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదని, ఈ సర్క్యులర్ ప్రకారం వాళ్లకి తిరిగి మళ్లీ ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ఆదేశించాలని కోరారు. కొంత మందికి ఆ సర్క్యులర్ ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించి, యస్‌డబ్ల్యూఎఫ్ సభ్యుల విషయంలో న్యాయం చేయకపోవడం ఏకపక్ష నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అది మంచి పద్ధతి కాదని, డిపో మేనేజరు వెంటనే వారికి ఉద్యోగ అవకాశాలు ఇప్పించాలని లేకుంటే భవిష్యత్తు లో ఆందోళ నలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి డి శ్రీధర్, అధ్యక్షులు రాము, ఎస్‌ఎవి కృష్ణ, కె సురేంద్ర, కె సుబ్రహ్మణ్యం, ఏ శీనయ్య సందీప్, పి కిరణ్, కందకూర్ రుక్మిణమ్మ, సిఐటియు నాయకులు యస్ సురేష్, చంద్రమోహన్, బి చంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

పరుగులు పెడుతున్న పంచాయతీల అభివృద్ధి

- చంద్రగిరికి 30 ట్రాక్టర్లు మంజూరు
- ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: గత వైసిపి పాలనలో అభివృద్ధి ఎరుగని పంచా యతీలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని అందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల అభివృద్ధికి 30 ట్రాక్టర్లను మంజూరు చేశారని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. మొదట తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పుదిపట్ల గ్రామ పంచాయతీకి ఎస్సీ కార్పొరేషన్ నిధుల ద్వారా 7 లక్షల రూపాయలతో మహేంద్ర ట్రాక్టర్‌ను సర్పంచ్ బడి సుధాయాదవ్, పంచాయతీ అధికారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఎమ్మెల్యే నాని స్వయంగా ట్రాక్టరును నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలలో పంచాయతీలకు నిధులు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారని కనీసం మరమ్మతులకు నోచుకోలేక ట్రాక్టర్లను మూలన పడేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పంచాయతీ శాఖ నిధులు మంజూరు చేస్తూ ట్రాక్టర్లను అందించిందని, పంచాయతీల అభివృద్ధికి అన్ని రకాలుగా తోడ్పాటు నంది స్తోందన్నారు. దీంతో సర్పంచులు ప్రభుత్వానికి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు, బడి సుధా యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు ఏ ఈశ్వర్ రెడ్డి, బిరుదుల భాస్కర్ రెడ్డి, అల్మినేని మధు నాయుడు, వైకుంఠం శ్రీధర్ నాయుడు, కరుణాకర్ రెడ్డి, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టరును నడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

గ్రంథాలయాల మధ్య అనుసంధానం అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : సాంకేతికత ద్వారా దేశంలోని అన్ని గ్రంథాలయాలను అనుసంధానించి ప్రజలకు, విద్యార్థులకు, పరిశోధకులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్వియూ ప్రధాన గ్రంథాలయం ఆధ్వర్యంలో 'టెక్నాలజీ, ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఫర్ అకడమిక్ అండ్ పబ్లిక్ లైబ్రరీ ఎంపవర్‌మెంట్' అంశంపై రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సు శనివారం వర్సిటీ సెనేట్ హాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వియూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ దేశంలోని అన్ని గ్రంథాలయాల్లో ఉన్న డేటాను టెక్నాలజీ ద్వారా అనుసంధానించాలని కోరారు. దీని ద్వారా ప్రజలందరూ విజ్ఞానవంతులు కావడానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, డిఆర్‌డివో డాక్యుమెంటేషన్ విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు, బెంగళూరుకు చెందిన ఇండియన్ స్టాటిస్టికల్ సెంటర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, ఎస్వియూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నాయుడు, ఇన్ ఫ్లిబ్ నెట్ డైరెక్టర్ దేవికా మదల్లి, డాక్టరు కిషోర్, డాక్టరు రంగనాథం, వివిధ రాష్ట్రాలకు ప్రతినిధులు, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలి: సీఐ

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): విద్యార్థులు పాఠశాల దశ నుండే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో ప్రవర్తించకుండా, పెడదారిన పడితే జీవితం అంధకారమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. చంద్రగిరి మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శనివారం 'మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు' అనే నినాదంతో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను పండుగ వాతావరణం లో నిర్వహించారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులకి రంగవల్లులు, పలు క్రీడలలో పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి పట్టణంలోని పద్మావతి బాలిక ఉన్నత పాఠశాలలో సిఐ సుబ్బరామి రెడ్డి, ఎస్ఐ అనిత విద్యార్థులకు సైబర్ నేరాల గురించి, డ్రగ్స్ వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లల నడవడిక రోజు వారి కార్యక్రమాల పై శ్రద్ధ పెట్టాలని చెప్పారు. తరచుగా పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో తమ పిల్లల చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. వీలైనంతవరకు పిల్లలను సెల్ఫోన్లకు చెడు అలవాట్లక దూరంగా ఉంచాలని సూచించారు.ఈ క్రమంలోనే పాఠశాలలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా వచ్చిన అతిథులకు భోజన సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్,మండల విద్యాశాఖ అధికారులు ఎస్ లలిత కుమారి , కె. భాస్కర్ బాబు, స్పెషల్ ఆఫీసర్ సాగర్, ప్రధానోపాధ్యాయులు వెంకటనారాయణ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ భాష, ధనంజయ రెడ్డి , సునీల్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం మెగా పిటిఎం మంగళంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల భవిష్యత్తు విలువను, చెడు వ్యసనాల వలన చిన్న వయసులోనే నేరస్తులుగా మారుతుండడం పలు అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ రవి మనోహర్ ఆచారి మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పలు పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్, చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, ఎస్ఎంసి కమిటీ చైర్ పర్సన్ షేక్ భాను ఉపాధ్యాయినిఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి

యర్రావారిపాలెం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం మెగా ఆత్మీయ తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మండలంలో ఆదర్శ పాఠశాల చదువుతోపాటు ఆట పోటీలలో మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం చదువులో మరింత ప్రోత్సాహం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పరమేశ్వర్ స్వామి, రాష్ట్ర రజక డైరెక్టర్ అన్నాసముద్రం మధు, ఎస్ఐ డివై స్వామి, ఎంఈఓ బాలసుబ్రమణ్యం,టిడిపి నాయకులు మహేష్ నాయుడు, వెంకట శివరాం రెడ్డి,కొల్లు ప్రసాద్ ,తలకోన చైర్మన్ సోమనాథ్ రెడ్డి,మోడల్ స్కూల్ ఛైర్మన్ ఉదయ్ కుమార్, బాలకృష్ణ కమిటీ కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు సర్పంచులు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : విద్యాభ్యాసంలో ఉన్న ప్రతి విద్యార్థికి వారి తల్లిదండ్రుల పర్యవేక్షణ,ప్రోత్సాహం ఎంతో అవసరమని ఎం జె పి కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య సూచించారు. శనివారం మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల ఆవరణంలో తల్లిదండ్రులు – ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మండల ప్రజా పరిషత్ ఉప మండల అధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి,ప్రత్యేక ఆహ్వానితులుగా నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో జ్యోతిర్మయి, కళాశాలబోధన సిబ్బంది, పాల్గొన్నారు.

పిచ్చా టూరు: తల్లిదండ్రులు, టీచర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి. ఇలంగోవన్ రెడ్డి, ఎంఈఓ హేమమాలిని, యుగంధర్ రాజు, ప్రధాన ఉపాధ్యాయుడు రవి, ఎస్సై వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పార్టీ కార్యకర్తలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు అడుగులు: రవి నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని సత్యనారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశ కార్యక్రమానికి రవి నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశ కార్యక్రమానికి తిరుపతి నగరపాలక సంస్థ 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్ పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులకు మధ్య మంచి సఖ్యత వాతావరణాన్ని కల్పించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల స్కిల్స్ ను మరింతగా పెంచుకోవడానికి ఈ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భం గా విద్యార్థులకు విద్యకు, క్రీడలకు ఉపయుక్తమైన వస్తువులతో పాటుగా పాఠశాల అభివృద్ధికి రూ.10 వేల రూపాయల చెక్కును పాఠశాల ప్రధానోపా ధ్యాయులకు అన్నా అనిత యాదవ్ అందించారు. ఈ కార్యక్ర మంలో వార్డు అధ్యక్షులు శీను యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, శంకర్‌యాదవ్, కొర్ల గుంట ముని, కోట్ల హేమంత్, పాల్యం ఉదయ్ పాల్గొన్నారు.

పాఠశాలకు చెక్‌ను అందిస్తున్న అన్నా అనితాయాదవ్

పరిశోధక విద్యార్థులకు రూ.15 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి- క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో 300 మందికి పైగా ఉన్న పరిశోధక విద్యార్థులకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇస్తున్న ఫెలోషిప్స్ లాగానే యూనివర్సిటీలో ప్రతినెల రూ.15 వేలు ఇవ్వాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు యూనివర్సిటీ రిజిస్ట్రారు భూపతి నాయుడుని కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులకు ఎటువంటి ఫెలోషిప్స్ లేక పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తూ పరిశోధనలు సాగిస్తున్నారని ఇలా చేయడం వల్ల పరిశోధన పైన దృష్టి సారించలేరని, గత ప్రభుత్వం కూడా పరిశోధక విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని కూటమి ప్రభుత్వంలో అయినా వర్సిటీ బడ్జెట్‌లో నాన్ నెట్ ఫెలోషిప్‌లు కేటాయించి పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్ ఇచ్చేలా కృషి చేయాలని వారు కోరారు. స్పందించిన భూపతి నాయుడు త్వరగా నాన్ నెట్ ఫెలోషిపు లు పరిశోధక విద్యార్థులకు ఇచ్చే విధంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సెలింగ్‌లో చర్చించి నిర్ణయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ అక్బర్, రీసెర్చ్ స్కాలర్ అశోక్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ బి .ఆర్కే నాయుడు, ఎన్ఎస్‌యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జై మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రసిడెంట్ సి రంజిత్ కుమార్, జిఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్ నాయక్, జిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేంద్ర నాయక్ ,లా విద్యార్థి సంఘం నాయకులు మోహన్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంలపై అవగాహన ఉండాలి: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ మేరకు పుత్తూరు న్యాయవాదులు సంఘం భవనంలో అసోసియేషన్ అధ్యక్షులు కే పురుషోత్తం ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంలపై న్యాయవాదులకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాజ్యం కంటే మధ్య వర్తిత్వం ఎక్కువ సంతృప్తి కరమైన ఫలితాన్ని ఇస్తాయన్నారు. మధ్యవర్తిత్వం పరిష్కారమైన వ్యాజ్యాలలో కోర్టు ఫీజులు వసూలు చేస్తారన్నారు. మధ్య వర్తిత్వం ఆందోళన తగ్గించి మనశ్శాంతిని ఇస్తాయన్నారు. వైరం వర్గాల మధ్య వ్యాపారం, వ్యక్తిగత సంబంధాలు పునరుద్ధరించేందుకు తోడ్పడుతాయన్నారు. ఈనెల 14వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గోపాలకృష్ణ, నగరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణు వర్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

సమన్వయంతో విద్యార్థులకు ఉజ్వల భవిత: డిఎస్పి

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పిల్లల పట్ల జాగ్రత్త వహిస్తూ వారిని క్రమశిక్షణలో నడుపుతూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉందని మహిళా డిఎస్పి శ్రీలత వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీటీడీ గోవిందరాజ స్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు విద్యా బుద్ధిలో తల్లిదండ్రులు పాత్ర ప్రధానమైనన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సపోర్టు వ్యవస్థాపకురాలు తసున్నీషా బేగం, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ లత, మంజుల విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీలత

టీషర్టులు ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : వుయ్ వైబ్ ఆర్గనైజేషన్ అధిపతి రాఘువీణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణలు 'వుయ్ రన్ ఫర్ తిరుపతి' టీషర్టును శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రేపు ఉద యం 6 గంటలకు ప్రారంభ మవుతుందని కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా "ఈగల్ " విభాగం ఐజి, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి కలెక్టర్, ఎస్పీ, బిగ్ బాస్ ఫేమ్, వీ వైబ్ సంస్థ అధినేత రాఘ వీణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు తదితరులు పాల్గొంటారని వివరించారు. ఈ పరుగు పందెంలో గెలిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకరమైన బహుమతులు ఉంటాయని వారు తెలిపారు.

వుయ్ రన్‌ఫర్ టీ షర్టులు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శోభాయాత్రను విజయవంతం చేద్దాం: విజయ శంకర స్వామి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 11న గీతా జయంతి సందర్భంగా మంగళం బిటీఆర్ కాలనీ నుండి టిటిడి పరిపాలన భవనం వరకు నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీ విజయ శంకర స్వామి కోరారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలలో అన్నమయ్య నివసించిన ఇంటిని తిరిగి నిర్మించాలని, టిటిడి అనుబంధ ఆలయాల ప్రాంతాల్లో హరినామ సంకీర్తలను నిత్యం జరపాలని, భజన గురువులకు టిటిడి గౌరవ వేతనం ఇవ్వాలని టిటిడి బోర్డుకు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అందరికి శ్రీహరే అంతరాత్మ పుస్తకాన్ని, అన్నమయ్య కళాక్షేత్రం లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శులు సంక్రాంతి వెంకటయ్య, దేవానంద్, జై భారత్ ఫౌండేషన్ నిర్వాహకులు రజిని, మహేష్ పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినవి

లింగారెడ్డి కార్తిక్ రెడ్డి అను నేను ఆర్.కె.పురం, నాయుడుపేట టౌన్ కాపురస్తుడను. నేను మా పొలం డాక్యుమెంట్లను జిరాక్స్ తీసుకురావడం కోసం నాయుడుపేట బజారు వీధిలో తే.30-11-2024 దిన ఉదయం 11 గం॥లకు పోతూ వుండగా మిస్ అయ్యాయి. కావున ఎవరికైనా దొరికినట్లైతే నా ఫోన్ నెం.9959966103 కి తెలుపగలరని కోరుకుంటున్నాను.

డాక్యుమెంట్ నెం.**1674/2008** లింగారెడ్డి కార్తిక్‌రెడ్డి, తండ్రి కేశవ దాసురెడ్డి వురఫ్ రాజగోపాల్‌రెడ్డి.

డాక్యుమెంటు నెం. **1030/1971** లింగారెడ్డి కేశవ దాసురెడ్డి వురఫ్ రాజగోపాల్‌రెడ్డి. తండ్రి వీరరాఘవ రెడ్డి

ఇట్లు,
లింగారెడ్డి కార్తిక్‌రెడ్డి,
తండ్రి, రాజగోపాల్ రెడ్డి, వురఫ్ కేశవదాసురెడ్డి
ఆర్.కె.పురం, నాయుడుపేట, తిరుపతి జిల్లా.
ఫోన్ : 9959966103.

ధరల 'దడ'

ఆరు నెలల్లో పెను భారం

ధరల పెరుగుదల ఇలా...
(కిలోకు రూ.లలో, నూనె లీటర్లలో)

నిత్యావసరాలు	జూన్	నవంబర్
కర్నూలు సోనా	55	62
కంది పప్పు	160	210
శనగపప్పు	90	125
పెసర పప్పు	100	130
మినప పప్పు	100	160
వేరుశనగ	95	135
ఉల్లి .	60	80
సన్ ఫ్లవర్ ఆయిల్	110	155
పామాయిల్	98	135
వేరుశనగ నూనె	120	165
పంచదార	35	45
వెల్లుల్లి	190	400

ప్రజాశక్తి తిరుపతి టౌన్

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు చిన్న, మధ్య తరగతి ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. సంపాదన మూరెడు.. ఖర్చులు బారెడు చందంగా పరిస్థితులు మారాయని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. కుటుంబమంతా పని చేసినా పెరుగుతున్న నిత్యావసర ధరలతో రెండుపూటలా తినలేని పరిస్థితి నెలకొంది. మధ్య తరగతి ప్రజల నెలసరి ఆదాయానికి ఖర్చు కు పొంతన కుదరడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది.

గడిచిన 6 నెలలుగా పెరిగిన ధరలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పప్పులు, నూనెలు, కూరగాయలూ ఇలా ఒక్కటేంటి అన్ని ధరలూ భగ్గుమంటున్నాయి. గత ప్రభుత్వం ధరల నియంత్రణలో విఫలమైన విషయం విధితమే. తాము అధికారంలోకొస్తే ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్న కూటమి నేతలు ఎన్నికల ముందు హామీలు గుప్పించారు. అయితే ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వం కన్నా ధరలు మరింత పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతం సామాన్యుల నిత్యావసరాల కోసం నెలవారీ బడ్జెట్ రూ. 20వేల నుంచి రూ 30వేలు చేరిందని వాపోతున్నారు. కిలో సన్ఫవర్ నూనె 6 నెలల క్రితం రూ.105 కాగా ప్రస్తుతం దాని ధర రూ.150కి చేరింది.పామాయిల్ ధర రూ.98నుంచి దశల వారీగా ప్రస్తుతం రూ.135కి చేరింది. వేరుశెనగ నూనె ధర రూ. 155 నుంచి రూ. 190 వరకు చేదింది. నిత్యావసరమైన నూనెల ధరలు ప్రజలకు అందనంత దూరానికి ఎగబాకుతున్నాయి. కనీసం పప్పు నీళ్లతో అయినా కాలం గడుపుదామ సుకున్నా అది అందుబాటులో లేని పరిస్థితి. కందిపప్పు కేజీ రూ.165 నుంచి దశల వారీగా రూ.210కి చేరింది. మినుములు రూ.100 నుంచి రూ.160, పెసరపప్పు రూ.100 నుంచి రూ. 130. చక్కెర రూ. 35 నుంచి రూ.45 వరకు, గోధుమలు రూ.50 నుంచి రూ.66 వరకు పెరిగాయి. కూరగాయల ధరలూ అదే బాటలో ఉన్నాయి. గతంలో కార్తీక మాసంలోనూ లేదా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు.. డిమాండ్ కు సరిపడా సరకు లేనప్పుడు మాత్రమే సరుకుల ధరలు పెరిగేవి. నేడు ఈ పరిస్థితులకు భిన్నంగా గడిచిన కొన్ని నెలలుగా కూరగాయల ధరలు నింగిని తాకుతున్నాయి. ప్రస్తుతం టమోటా బహిరంగ మార్కెట్లో రూ.60 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. బెండ, బీర, చిక్కుడు ఇతరాత్ర రకాలు ఏదేని కేజీ రూ.50 తక్కువ లేదు. రైతు బజార్లలో స్వల్పంగా ధరల వ్యత్యాసం ఉన్నప్పటికీ నాణ్యతా లోపంతో కొనుగోలు దారులకు నిరాశే ఎదురవువుతోంది. అదే విధంగా రైతు బజార్లలో సచ్చిదీపై కొన్ని రకాల నిత్యావసరాలు విక్రయిస్తున్న విషయం విధితమే. అయితే రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే సబ్సిడీ ధరలకు నిత్యావసరాలు అభిస్తున్నాయి. బియ్యం, సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్, కందిపప్పు సరు కుల ధరలు వ్యత్యాసం స్వల్పంగానే ఉండటంతో కొనుగోలు దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం ధరలు సైతం రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. కిలో సన్నబియ్యం కేజీ రూ.50 నుంచి ప్రస్తుతం రూ.62లకు చేరింది. కొన్ని సాధారణ రకాల బియ్యం కూడా కేజీ రూ.50 పైనే ఉన్నాయి. దీంతో నెలకు 26 కేజీలు వినియోగించే ఒక కుటుంబపై రూ.300 వరకూ అదనపు భారం పడుతోంది. పేదలు రేషన్ బియ్యం ఉన్నంత వరకూ వాడుకుంటున్నారు. అనంతరం మరో పది నుంచి 15 కేజీలు బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

శ్రీసిటీలో 'ఈప్యాక్' విస్తరణకు భూమిపూజ

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

శ్రీసిటీలోని ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ పరిశ్రమ, తమ అధునాతన అదనపు ఉత్పత్తి కేంద్రానికి శనివారం భూమిపూజ చేపట్టింది. గృహోపకార పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఏసీల తయారీలో గ్లోబల్ లీడర్ అయిన హైసెన్స్ సంస్థతో వ్యాపార భాగస్వామ్యంలో భాగంగా నూతన ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఈప్యాక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అజయ్ సింఘానియా, డైరెక్టర్ ఎల్ బి బోత్రా, హైసెన్స్ ఇండియా సీఈఓ పంకజ్ రాణా, మేనేజింగ్ డైరెక్టర్ స్టీవెన్‌లీ పాల్గొన్నారు.హైసెన్స్ సంస్థ రూపొందించిన సాంకేతికత, డిజైన్‌ల మేరకు ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్‌లు, రిఫ్రిజిరేటర్‌లు, ఇతర చిన్న చిన్న గృహోపకర వస్తువుల ఉత్పత్తికి అవసరమైన తయారీ లైన్లను ఈ నూతన ఉత్పత్తి కేంద్రంలో నిర్మించనున్నట్లు తెలిపారు. హైసెన్స్, ఈప్యాక్ యాజమాన్యాలను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.రూ.91 కోట్ల పెట్టుబడితో 9 ఎకరాల విస్తీర్ణంలో ఈప్యాక్ అదనపు ప్లాంట్ నిర్మాణం చేపట్టగా, జూన్ 2025 నాటికి ఉత్పత్తులు ప్రారంభం కావచ్చని అంచనా. ప్రస్తుతం ఈప్యాక్ పరిశ్రమలో 700 మంది పనిచేస్తుండగా, నూతన ఉత్పత్తి కేంద్రంతో మరో 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనుంది.

పైప్ లైన్ నాశనం చేస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సహజ వాయువు పైప్‌లైన్‌ను తవ్వి నాశనం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పని ఏజీ అండ్ పి ప్రథమ్ సంస్థ పిఆర్ ఓ మహేష్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీ సాయి నగర్‌లో, ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ ద్వారా వేయబడిన సహజ వాయువు పైప్‌లైన్‌ను ఇటీవల డ్రైనేజీ పైప్‌లైన్‌ను అమర్చడానికి ప్రయత్నిస్తున్న ఇంటి యజమాని చేపట్టిన తవ్వకాల కారణముగా పాడయ్యిందన్నారు. ప్రస్తుత చట్టాల ప్రకారం ఐపీసీ సెక్షన్ 285, 336 కింద ఈ తరహా అనధికార నష్టాలకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, 25 కోట్ల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. ప్రభుత్వ చట్టం ప్రకారం, తతీయ పక్షం తవ్వకం పనులను ప్రారంభించాలనుకుంటే, వారు 'డయల్ బిఫోర్ యు డిగ్' కాంటాక్ట్ నంబర్, 1800 2022 999 ద్వారా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి తెలియజేయాలని సూచించారు. లేని పక్షంలో సహజ వాయు సరఫరాకు ఆటం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేశవరెడ్డి సెంట్రల్ లీగ్ పోటీల్లో సాయివిష్ణు ఘనత

ప్రజాశక్తి -రేణిగుంట

కేశవరెడ్డి విద్యాసంస్థలు- ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ కెసిఎల్ పోటీలలో, రెండు రాష్ట్రాలకు సంబంధించిన "ఆటలపోటీలు" కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలో దాదాపుగా 50 పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ నెల 6 తేదీ నుండి 8 వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలలో మొదటి రోజు అథ్లెటిక్స్‌కు సంబంధించి షాట్‌పుట్‌లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా మామండూరు విద్యార్థి సాయివిష్ణు మొదటిస్థానాన్ని సాధించారు. వర్షహాసిని 100 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. వీరిని విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ కేశవరెడ్డి అభినందించారు.

విద్యార్థులు సాహితీ కార్యక్రమాల్లో పాల్గొనాలి : మధుజ్యోతి

ప్రజాశక్తి - క్యాంపస్

తెలుగు విద్యార్థినిలు సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనాలని తెలుగు విభాగ అధ్యక్షులు ఆచార్య కొలుకులూరి మధుజ్యోతి పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి తెలుగు అధ్యయనశాఖలో తెలుగు సాహితీ సమితి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆచార్య కొలకలూరి మధు జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులందరూ అన్ని కార్యక్రమాల్లో పాల్గొని ప్రగతి పథంలో ముందుండాలని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను పిల్లలు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు అరుదుగా జరుగుతూ ఉంటాయని, ఈ అభినందన సభను ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. సాహితీ సమితి సలహాదారుగా డాక్టర్ వై సుభాషిని మాట్లాడుతూ పిల్లల్లో కార్యదక్షత, క్రమశిక్షణ ఉండాలని పేర్కొన్నారు. పిల్లలు ధైర్యంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొనమని ప్రోత్సహించారు. సాహస యాత్రకు వెళ్లిన జి.మధుయామిని తన క్యాంపులో జరిగిన అనుభవాలు అనుభూతులు పంచుకున్నారు. క్యాంపులో చిన్నచిన్న ఆటుపోట్లు ఎదురైన విజయవంతంగా పూర్తి చేసామని చెప్పారు. ప్రీఆర్. డి. క్యాంపుకు వెళ్లిన ప్రత్యూష ట్రైన్లో ఇబ్బందులు పడినా తన లక్ష్యం వైపే తన చూపును మలుచుకొని క్యాంపును విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చామని చెప్పారు. క్యాంపుకు వెళ్లిన విద్యార్థినులను జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. యువశ్రీ, డాక్టర్ బి. లక్ష్మీప్రియ, సాహితీ సమితి అధ్యక్షులు ఎ.ప్రనూష, సాహితీ సమితి ఉపాధ్యక్షులు జి.వాణి సాహితీ సమితి కార్యదర్శి బి.శిరీష, సాహితీ సమితి కోశాధికారి మోహిత, విద్యార్థినీలు పాల్గొన్నారు.

సప్తవర్ణ శోభితం శ్రీ పద్మావతి అమ్మవారి పుష్పయాగం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసిన అనంతరం శనివారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా టీటీడీ ఉద్యానవన శాఖకు దాతలు సమర్పించిన 4 టన్నుల పుష్పాలు అమ్మవారి పుష్పయాగానికి వినియోగించారు. ఇందులో 2 టన్నులు తమిళనాడు, ఒక టన్ను ఆంధ్రప్రదేశ్, ఒక టన్ను కర్ణాటక రాష్ట్రాల నుండి దాతలు అందించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, గార్డెన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులు స్వయంకృషితో ఎదగాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయంకృషితో ఆర్థికంగా ముందుకెళ్లాలని డిఆర్ఓ నరసింహులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో విభిన్నప్రతిభావంతులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయంకృషితో జీవించాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ లీడర్లు మాధవ, మురళి, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, విజయ లక్ష్మీ, సుబ్రమణ్యం రెడ్డి, పద్మజ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి : పీడీ

ప్రజాశక్తి - నాయుడుపేట

సాగు ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతున్న తరుణంలో అధిక దిగుబడులు పొందేందుకు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందివ్వాలని నెల్లూరు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శివ నారాయణ తెలిపారు. గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేట డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి నాయుడుపేట ఐసీ డి యస్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన శిక్షణలో కేంద్రంలో ఆయన మాట్లాడారు. పంటలను ఆశిస్తున్న చీడల నివారణకు రసాయనాలకు మొదట ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రత్యామ్నాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం నెల్లూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వినీత వరి సాగులో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కూలీల సమస్య కారణంగా వరి లో ఉపయోగించవలసిన కలుపు మందుల వినియోగంపై సిబ్బందికి ఆమె శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య, ఏడిఎ లక్ష్మీదేవి, ఉత్తమ ఎరువుల యాజమాన్యం ప్రకతి వ్యవసాయం పై శిక్షణ ఇచ్చారు.